ప్రజాశక్తి
గురువారం 20 ఏప్రిల్ 2023
5
పార్వతీపురం మన్యం



బోధన సక్రమంగా జరగాలి

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలోని పాఠశాలల్లో విద్యా బోధన సక్రమంగా జరగాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. బుధవారం సంబంధిత విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, నాణ్యమైన భోజనం అందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయివేట్ పాఠశాలల్లో 25 శాతం శాతం సీట్లు పేదలకు కేటాయించాలన్నారు. ఐటిడిఎ ఆధ్వర్యంలో శ్రీకాకుళం వైటిసిలో కొనసాగుతున్న సూపర్ 60 బ్యాచ్‌ను కొనసాగించుటకు చర్యలు తీసుకొంటామన్నారు. విద్యార్థుల డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిడి బి.నగేష్, ఇఇ జి.మురళి, ఒఎస్‌డి ఎడ్యుకేషన్ ఎం.యుగంధర్, గురుకుల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, ఎటిడబ్ల్యుఒలు, తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో చెరువు వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి కూలీలకు ఎన్ఎంఎంఎస్ కష్టాలు

- రెండు పూటలా ఫొటో దిగాల్సిందే
- లేకుంటే వేతనం కట్

ఉపాధి హామీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్ఎంఎంఎస్ యాప్ కూలీలకు కష్టాలను తెచ్చి పెడుతోంది. కొత్తగా ఉపాధి కూలీలకు కమ్యూనిటీ వర్క్సకి అయితే ఒక పద్ధతి, రైతు పనికైతే ఇంకో పద్ధతి పెట్టి ఉపాధి కూలీలను అయోమయానికి గురి చేస్తూ రెండుసార్లు ఫొటో సిస్టం పెట్టింది. దీంతో ఉదయం 11 గంటల్లోపు ఒకసారి సాయంత్రం రెండు గంటల నుండి ఐదు గంటలలోపు మరొక సారి ఫొటో దిగాలి. అలా యాప్‌లో ఫొటో తీయకపోతే ఆరోజు దినసరి వేతనం ఉపాధి కూలీలకు పడదు. ఈ కొత్త పద్ధతులతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే అధికంగా ఎండలు ఉండడంతో మరింత ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో వివిధ రకాల మార్పులు తీసుకురావడం, బడ్జెట్లో నిధులకు కోత పెడుతూ ఉపాధి నిర్వీర్యానికి కుట్ర పన్నుతోంది.

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని 23 గ్రామ పంచాయతీల 6280 మంది ఉపాధి కూలీలు పనులకు వెళ_తున్నారు. వీరు రెండు పూటలా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్ విధానంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఫొటోలు తీసుకోవాలి. ఒకవేళ ఫొటో తీసుకోకపోతే వేతనం పడదు. కూలీలు ఉదయం వంట చేసుకోకుండా పనికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత పద్ధతిని కొనసాగించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న టిసిఎస్ నుండి ఎస్ఎఐసికి మార్పు చేసింది. ఉపాధి హామీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లింది. గతంలో కూలీలకు పనిముట్లకు, మజ్జిగ, నీళ్లకు అదనంగా ఇన్సెంటివ్ పడేది. మేట్లకు, ఒక ఉపాధి కూలీకి మూడు రూపాయలు చొప్పున ఇన్సెంటివ్ పడేది. అదనపు ఇన్సెంటివ్ మార్చిలో 20 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం వచ్చేది. పని ప్రదేశంలో నీడ వసతులు, మజ్జిగ వంటివి ఏర్పాటు చేసేవారు. ఎస్ఐసి పద్ధతి ద్వారా పని ప్రదేశంలో జియో ట్రాక్ ఫొటో తీయాల్సి ఉంది. రెండుసార్లు కచ్చితంగా ఫొటో తీయాలి. మేట్లకు ఎలాంటి సెల్‌ఫోన్ ఇవ్వకుండా ఈ యాప్ విధానాన్ని అమలు చేయించడం గమనార్హం. గతంలో 20 మందికి ఒక మేట్ ఉండగా ఇప్పుడు 40 నుండి 50 మంది దాకా ఒక మేట్ ఏర్పాటు చేశారు. ఉపాధిలో జరుగుతున్న మార్పుల వల్ల ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉపాధి నిర్వీర్యానికి కుట్ర

ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్ 4 శాతం కేటాయించాల్సిన నిధులను 1.3 శాతానికి కుదించింది. గత బడ్జెట్లో రూ.90 వేల కోట్లు కాగా ఈ సారి 60 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. కొత్తగా రెండు పూటలా ఫొటోల పద్ధతిని తీసుకురావడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతినే పెట్టాలి. ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలి. కూలీలకు అదనపు ఇన్సెంటివ్, పనిముట్లకి డబ్బులు ఇవ్వాలి. వేసవి దృష్ట్యా పని దగ్గర నీడ, మంచి నీరు, తదితర వసతులు కల్పించాలి.

- ఎం.శ్రీనివాసరావు,
సిపిఎం కురుపాం మండల కార్యదర్శి

ఆర్నెల్లుగా అప్పులే

- అందని డైట్ బిల్లులు
- భారంగా వసతిగృహాల నిర్వహణ
- ఆందోళనలో డిప్యూటీ వార్డెన్లు, వసతిగృహాధికారులు

పోస్ట్ మెట్రిక్ వసతిగృహం

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలకు ఆరు నెలలుగా డైట్ బిల్లులు అందడం లేదు. దీంతో డిప్యూటీ వార్డెన్లు, వసతిగృహ అధికారులు అప్పులు చేసి వసతిగృహాలను నడుపుతున్నారు. దీంతో వారికి ప్రతినెలా భారంగా మారింది. నిత్యావసర సరుకులు తేవడానికి వెళ్లిన వసతిగృహ అధికారులు.. వ్యాపారులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో మొహం చాటేస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 47 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, 16 పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో సుమారు 12 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఒకటి నుండి 10వ తరగతి వరకు ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం రోజుకి 40 రూపాయలు కేటాయించింది ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి భోజనం, సాయంత్రం రాగి మాల్ట్, అరటిపండు, పల్లిపట్టి, 100 మిల్లీలీటర్ల పాలు, వారానికి రెండు రోజులు చికెన్ పెట్టాల్సి ఉంది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒకరికి రోజుకి 45 రూపాయలు ఇస్తున్నప్పటికీ అదే మెనూ అయినా, మరి కొంచెం పెంచాలి. సెప్టెంబర్ నెల నుంచి మార్చి వరకు బిల్లులు అందలేదు గడుస్తున్న ఏప్రిల్ చివరికి వచ్చేస్తోంది.

ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థికి కొత్త మెనూ ప్రకారం రోజుకి 52 రూపాయలు, నెలకు 1600 కేటాయించింది. అది జూన్ నెలలో నుంచి అమలు చేయాల్సి ఉంది. 2018లో అమలు చేసిన మెనూ ప్రకారం నిత్యావసర సరుకుల ధరలు అప్పటికీ, ఇప్పటికీ చాలా వ్యత్యాసాలు కనిపించడంతో వసతిగృహ నిర్వాహకులు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. 2018లో కేజీ కందిపప్పు 70 ఉంటే ప్రస్తుతం రూ.110కు చేరింది. మినప గుళ్ల అప్పట్లో 50 రూపాయలు ఉంటే ప్రస్తుతం రూ.100, పామాయిల్ రూ.60 ఉంటే ప్రస్తుతం రూ.110.. ఇలా ప్రతి ఒక్కటీ రెండు మూడింతలు పెరిగాయి. ఆశ్రమాలకు, గురుకులాలకు నిత్యావసర సరుకులను గిరిజన సహకార సంస్థ టెండర్ల ద్వారా సరఫరా చేస్తుంది. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో జిసిసి సుముఖం చూపడంలేదు. దాంతోపాటు గ్యాస్ అరువు ఇవ్వకపోవడంతో చేతిలో చమురు లేకపోవడంతో వసతిగృహ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

డిడి వివరణ

ఇదే విషయాన్ని మన్యం డిడి బి.సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా డిసెంబర్ వరకు బడ్జెట్ వచ్చిందని చెప్పారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని, బిల్లులు ఆర్‌బిఐలో ఉన్నాయని తెలిపారు. సమగ్రంగా లేని బిల్లులు రిజెక్ట్ అయ్యాయని చెప్పారు.

మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

టిడిపిని నమ్మితే మునిగిపోతారు

- గడపగడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర
- హాజరుకాని అధికారులకు నోటీసులివ్వాలని ఆదేశాలు

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి నాయకులు మాటలు నమ్మితే నట్టేట మునిగిపోతారని డిప్యూటీ సిఎం రాజన్నదొర స్పష్టంచేశారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు విషయంలో తాను ఎమ్మెల్యేగా, ఇప్పుడు మంత్రిగా ఉన్న కాలంలో చేసింది, గతంలో ఎవరూ చేయలేదన్నారు. బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సంపంగిపాడు, డెన్సరాయి పంచాయతీలకు సంబంధించిన గిరిజనులతో సుల్లారి గ్రామంలో సభ నిర్వహించారు. ఇంతవరకు నియోజక వర్గంలోని మూడు మండలాల్లో 11 మారుమూల గిరిజన గ్రామాలకు రహదారులను తానే మంజూరు చేయించినట్లు చెప్పారు. 14 ఏళ్ల పాటు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సిఎంగా వున్నప్పుడు సాలూరు నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశారో స్థానిక టిడిపి నాయకులను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఆరేళ్ల ఎమ్మెల్సీగా పనిచేసిన జి.సంధ్యారాణి గిరిజన గ్రామాలకు ఎన్ని రోడ్లు మంజూరు చేయించారని ప్రశ్నించారు. గిరిజనులు అమాయకులు కావడంతో వారు ఎవరు ఏది చెప్పినా సులువుగా నమ్మేస్తారని తెలిపారు.

సంపంగిపాడు, డెన్సరాయి గ్రామాలకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. చెప్పుడు మాటలు వినకుండా వాస్తవాలు తెలుసుకుని నిజమైన గిరిజన నాయకుడిగా తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ భరత్ శ్రీనివాస్, రామకృష్ణ, సచివాలయాల కన్వీనర్ కె.త్రినాథనాయుడు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులకు నోటీసులు

బుధవారం మండలంలోని సుల్లారిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి గైర్హాజరైన పిఆర్ ప్రాజెక్టు, అటవీశాఖ అధికారులపై డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపంగిపాడు, డెన్సరాయి గ్రామాలకు రహదారి నిర్మాణం ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన ఈ రెండు శాఖల అధికారులను పిలిచారు. వారు రాలేదని తెలియడంతో ఆయన ఎంపిడిఒ పార్వతిపై ఆగ్రహించారు. పిఆర్ ప్రాజెక్టు, అటవీశాఖ అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఒను ఆదేశించారు.

ప్రత్యక్షమైన జంపింగ్ సర్పంచులు

ఇటీవల టిడిపిలో చేరిన సంపంగిపాడు సర్పంచ్ బుడియా చంద్రయ్య, డెన్సరాయి సర్పంచ్ మామిడి చిన్నమ్మి బుధవారం సుల్లారిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యక్షమయ్యారు. కొద్దిరోజుల క్రితం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణి 'ఇదేం కర్మ మనరాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా రూడి గ్రామం వెళ్లిన సందర్భంలో ఈ సర్పంచులిద్దరూ టిడిపిలో చేరినట్లు చెప్పారు. తమ గ్రామాలకు రహదారి నిర్మాణం విషయంలో వైసిపి నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించిన సర్పంచులు చంద్రయ్య, చిన్నమ్మి... డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం కొసమెరుపు.

బిజెపిని తరిమికొడితేనే మంచి రోజులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

గిరిజన, ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను అవలంబిస్తున్న బిజెపిని తరిమికొడితేనే దేశానికి మంచిరోజులు వస్తాయని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు స్పష్టంచేశారు. బిజెపి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం-సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొత్తవలస, రంగాలగూడ గ్రామాల్లో గిరిజనులతో సమావేశాలు నిర్వహించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి నిరంకుశ విధానాలపైన, దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువలు, గిరిజన హక్కుల పరిరక్షణకై పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని, దానికి సహకరించే శక్తులకు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా ఈనెల 27న పార్వతీపురంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, మండల నాయకులు లక్ష్మణరావు, నాగరాజు, చిరంజీవి, శీను తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్.. గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

కురుపాం : మండలంలో దురుబిలి, తెన్ను ఖర్జ గ్రామాల్లో సిపిఎం జిల్లా నాయకులు కొల్లి గంగునాయుడు, ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసి, కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 1/70 చట్టానికి తూట్లు పొడిచి, గిరిజనుల భూములు కార్పొరేట్లకు అప్పగించడానికి చూస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. జిఒ 3ని ఎత్తివేసి గిరిజన యువతకు ఉపాధి లేకుండా చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం గిరిజన యువత పాల్గొన్నారు.

కొమరాడ : ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపి, దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మండలంలోని డంగభద్ర, సరాపాడు, కోనవలస, తమ్మనదొరవలస, నందాపురం గ్రామాల్లో బుధవారం ప్రచారభేరి కార్యక్రమం చేపట్టారు. సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు ఈమరక రామారావు, రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివనాయుడు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కూలీలకు చేసిన మేలేమీ లేదన్నారు. ప్రజలెవరూ సంతోషంగా బతికే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో రాము, పకీరు, లక్ష్మణ్‌దొర, వెంకట్రావు, సంతోష్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గుమ్మలక్ష్మీపురం వారపు సంతలో సిపిఎం, సిపిఐ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఏప్రిల్ 25న నిర్వహించే సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మండంగి రమణ, ఎం శ్రీనివాసరావు, సన్యాసిరావు, సిపిఐ నాయకులు తోట జీవన, సూరయ్య, ప్రసాదరావు, సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నిరంకుశంగా ముందుకెళ్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర కోరారు సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం పార్వతీపురం పట్టణంలో 29వ వార్డు పరిధిలోని రామపురంకాలనీలో ప్రచార భేరి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ వార్డులో మహిళలు ఐదు రోజులుగా కుళాయిలు రాకపోవడంతో తాగునీటికి నానా ఇబ్బందులు పడుతున్నామని సిపిఎం బృందం వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సమస్యపై ఇందిర స్పందిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్: సిపిఎం ఆధ్వర్యంలో నెలిపర్తి పంచాయతీ బట్టివలస గ్రామంలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, ప్రజలకు నష్టం చేస్తూ, కుల, మత ఘర్షణ సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశానికి అన్ని విధాలుగా నష్టం చేస్తున్న బిజెపిని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వంతల చిన్న, గిరిజన సంఘంనాయకులు వంతల శివ, మర్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్, పార్వతీపురంటౌన్, గుమ్మలక్ష్మీపురం.. ప్రచారం చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

20 రూపాయలకు నీటిని కొనుగోలు చేస్తున్న మహిళలు

నీటి కోసం మహిళల ఆరాటం

రూ.20కు కొనుగోలు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం మండల కేంద్రంలో రక్షిత మంచినీటి పథకం ద్వారా గత నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో బుధవారం కూడా మహిళలకు నీటి కోసం ఆరాటం తప్పలేదు. ఈ నెల 18న రాత్రి 11 గంటల వరకు రెండు ట్యాంకర్ల ద్వారా ఒక్కొక్క వ్యక్తికి మూడేసి బిందెలు చొప్పున తాగునీరు సరఫరా చేశారు. ఆ నీరు ఎటూ చాలక పోవడంతో ఎండలు తీవ్రత వల్ల గొంతు తడుపుకునేందుకు కొంతమంది మహిళలు వట్టిగడ్డ వద్దకు పరుగులు తీసి చలమల నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. అవకాశం లేనివారు ట్యాంకర్లపై ఆధారపడి నీరు పట్టుకుని దాహార్తి తీర్చుకుంటున్నారు. నడుకూరు, విక్రంపురం, కత్తులకవిటి గ్రామాలతోపాటు వీరఘట్టంలో ఉన్న ఆర్ఒ ప్లాంట్ల ద్వారా 20 లీటర్ల క్యాన్ నీటిని రూ.20కు కొనుగోలు చేస్తున్నారు. బుధవారం కూడా జగ్జీవన్‌రాం కాలనీ, కస్బా, కూరాకుల, మెయిన్ రోడ్డులో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు.

అంబేద్కర్ జంక్షన్‌లో మరమ్మతులకు గురైన పైపులైనుకు బుధవారం మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రామచంద్రరావు ముమ్మారు ప్రయత్నాలు చేసి ఒంటి గంట సమయంలో ట్రైల్ వేశారు. రహదారికి ఇవతల అన్ని వీధులకు తాగునీరు సరఫరా చేస్తామని ఇఒ తెలిపారు. రహదారి అవతల సాయి నగర్ కాలనీ, బార్నాల, సెగిడి, గెంబలి, తదితర వీధులకు ప్రధాన పైపులైను మరమ్మతులు చేసేవరకూ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని వివరించారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వట్టిగడ్డ నుంచి నీటిని తీసుకువస్తున్న మహిళలు

కాలువల ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో 25వ వార్డు బొగ్గులవీధి, చాకలివీధిలో కాలువలపై చేపట్టిన నిర్మాణాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ మురళి తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధుల్లో ఉన్న కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల మురుగు తీసే అవకాశం లేక పారిశుధ్య కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీటితోపాటు స్థానికుల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆక్రమణలు తొలగించినట్లు చెప్పారు. భవిష్యత్తులో కాలువలపై శాశ్వత నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



కాలువపై ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్

ధర్నా చేస్తున్న కార్మికులు, ఫెడరేషన్ నాయకులు

కార్మికురాలి ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-సాలూరు

గుంటూరు కార్పొరేషన్‌లో కార్మికురాలు కె.విమల ఆత్మహత్యకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బుధవారం కార్మికులు ధర్నా చేశారు. గుంటూరులో 25వ డివిజన్ కార్పొరేటర్ కోటి లింగారెడ్డి వేధింపులకు గురి చేయడంతో పారిశుధ్య కార్మికురాలు విమల ఆత్మహత్యకు పాల్పడిందని ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు టి.రాముడు, కార్యదర్శి టి.శంకర్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బాధిత మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి ట్యాంకరును ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

తాగునీటి ట్యాంకరు ప్రారంభం

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో వేసవి నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం అద్దె ప్రాతిపదికన తీసుకున్న వాటర్ ట్యాంకర్‌ని బుధవారం చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె జెండా ఊపి ప్రారంభించారు. వేసవిలో పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా జరగదనే కారణంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్యాంకరు ద్వారా నీటి సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జరజాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కమిషనర్ హెచ్.శంకరరావు, వైసిపి నాయకులు బి.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-సీతానగరం

మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా లబ్ధిదారునికి అన్ని రకాల సామగ్రిని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకిరామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుక్కల పట్టివేతపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం మున్సిపల్ పరిధిలో జరిగిన కుక్కల స్కామ్ పై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారని గో సంరక్షణ సమైఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ తెలిపారు. బుధవారం గో సంరక్షణ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా కుక్కలను కొట్టి, తాళ్లతో బంధించి అపరేషన్ల పేరిట హింసించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనలో కమిషనర్ శ్రీరాముల నాయుడు, హెల్త్ ఆఫీసర్ కె.సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నైతిక అంశాలపై సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'నూతన వ్యాపారానికి కావలసిన చట్టపరమైన, నైతిక అంశాల'పై బుధవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్రీయ గిరిజనవిశ్వవిద్యాలయం, బిజినెస్ మేనేజిమెంట్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.వి.అప్పసబ విచ్చేశారు. కొత్త వ్యాపారాలకు భారతదేశంలో ఎదురయ్యే సవాళ్లను వాటి పరిష్కారాల గురించి వివరించారు. ముద్ర యోజన ద్వారా కొత్త వ్యాపారాలను ప్రారంభించవచ్చని, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజ్జి.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులకు సమాజంపై నూతన వ్యాపారం ఏ విధంగా ప్రభావాన్ని చూపిస్తుందో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి విద్యార్థులను నూతన వ్యాపార ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ హెచ్ఒడి డాక్టర్ ఎస్.వరూధిని,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న వాలీబాల్ రిఫరీ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23 న కొత్తవలస ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజి లో ఆంధ్ర ప్రదేశ్ వాలీబాల్ సంఘంనాధ్వర్యాన వాలీబాల్ రిఫరీ ఎగ్జామినేషన్ నిర్వహిస్తామని రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టివి భగవాన్ దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఎంపిక జరుగుతుందని, ఆసక్తి గల వారు అసోసియేషన్ కార్యదర్శి కెవిఎఎన్ రాజును(8919421590) సంప్రదించాలని తెలిపారు.

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన

బాడంగి : స్థానిక వెటర్నరీ హాస్పటల్‌లో పశువైద్య అధికారి గోవింద్ ఆధ్వర్యంలో పాడి రైతులు కృత్రిమ గర్భ ధారణ ద్వారా జన్మించిన ఆడ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వైవీ రమణ పాల్గొని మాట్లాడారు. కృత్రిమ గర్భధారణ ద్వారా ఎక్కువ శాతం ఆడ దూడలు పుట్టడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం కృత్రిమ గర్భ ధారణ ద్వారా రైతులు ఆవులకు ఇంజక్షన్‌లు చేయించుకుంటున్నారన్నారు. దీని ద్వారా రైతులకు అధిక లాభాలు పొందవచ్చు అని అన్నారు. అనంతరం మొదటి మూడు ఆడ దూడలకు బహుమతులు అందజేశారు.

భూ కబ్జాలపై ఫిర్యాదు

బొబ్బిలి : పట్టణ, మండల పరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై రెవెన్యూ యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దార్ నమ్మి రాజారావుకు సిపిఐ నాయకులు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ స్థలాలను చెరువులను కబ్జా చేస్తున్నారని పలుమార్లు రెవెన్యూ యంత్రాంగానికి విన్నవించుకున్న ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం శ్రీనివాస్. వై బాబ్జి, ఆర్ నాగమ్మ, డిహెచ్పిఎస్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ కట..

- విద్యుత్తు కోతలతో అల్లాడిపోతున్న ప్రజలు
- రాత్రి, పగలు తేడా లేకుండా సరఫరా నిలిపివేత
- పరీక్షల వేళ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అవసరాన్ని బట్టి డిస్కమ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో పగటిపూట గంటల తరబడి కరెంటు కోత విధిస్తున్నారు. మరోవైపు మున్సిపల్ ప్రాంతాల్లో రెండు గంటలకు పైగా అప్రకటిత విద్యుత్తు కోతలు ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి విజయనగరంలో కొన్ని ప్రాంతాల్లో 10 గంటల నుంచి 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు తీసేసిన కరెంట్ నాలుగు గంటలు వరకు ఇవ్వలేదు. ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. అయితే ఈ పవర్ కట్స్‌పై ముందస్తు సమాచారం లేకుండా అమలు చేయడంపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలు, పట్టణాల అన్న తేడా లేకుండా ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రాత్రి, పగలు తేగా లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఓవైపు ఎండ తీవ్రత, మరోవైపు విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండు వేసవిలో సమయం సందర్భం లేకుండా గంటల తరబడి విద్యుత్ కోతలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళ గంటల తరబడి కరెంటు సరఫరా నిలిపివేయడంతో చేయడంతో నరకయాతన అనుభవిస్తున్నామని చెబుతున్నారు.

ముందస్తు సమాచారం లేకుండానే..

గ్రామీణ ప్రాంతాలలో షెడ్యూల్ లేని విద్యుత్ కోతల కారణంగా జనాలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నగరాల్లో కూడా ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో జనం తీవ్ర


కొవ్వొత్తుల వెలుతురులో చదువుతున్న విద్యార్థినులు

ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు కూడా కరెంట్ కోతలతో పసిపిల్లల తల్లులు విసనకర్రలతో గాలి విసురుతూ కూర్చోవాల్సి వస్తోంది. విద్యార్థులు, పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారు కూడా కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలంతా తరగతి గదుల్లో ఉండి రాత్రిళ్లు ప్రశాంత నిద్ర లేక ఒత్తిడికి గురవుతున్నారు. కరెంట్ కోతలతో చిరువ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ కోతలను వ్యతిరేకిస్తూ రైతులు, ప్రజలు విద్యుత్ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ కోతలపై ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. కాల్ చేసి ఫిర్యాదు చేస్తున్న మరి కొంత మంది విద్యుత్ కోతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే కోతలు విధించే షెడ్యూల్ ప్రకటించాలని అడుగుతున్నారు.

కోతలు ఎందుకంటే..?

సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వర్గాల సమాచారం ప్రకారం.. అధిక పగటి ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగింది. ఏసీలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. రైతుల కూడా పంటలను కాపాడుకునే ప్రయత్నంలో మోటార్ పంపుసెట్లను ఉపయోగిస్తున్నారు. మరోవైపు షాపింగ్ మాల్స్, కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, ఆసుపత్రులు కూడా ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది కాబట్టి విద్యుత్ కోతలు తప్పవనే సమాచారం తెలుస్తుంది. విద్యుత్ కోతలు ఉంటాయా లేదా అనేది అధికారులను ప్రశ్నిస్తే సమాధానం రావడం లేదు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దు

నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-పాచిపెంట

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దని కోరుతూ మండలంలోని కుడుమూరు- మెట్టవలస జంక్షన్ వద్ద గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎస్.అప్పలస్వామి, సహాయ కార్యదర్శి కొర కళ్యాణ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా

గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

అప్పలస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల మనోభావాలను, సంప్రదాయాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదన్నారు. బిసిలతో సమానమైన బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చడం సరికాదన్నారు. దీనిపైన గిరిజన శాఖ మంత్రి, గిరిజన ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఆందోళనకు సిఐటియు జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అందులో భాగంగానే రాజకీయ లబ్ధి కోసం ఎస్‌టి జాబితాలో బోయ, వాల్మీకలను కలపాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.

ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రిని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఎక్స్‌రే యంత్రాన్ని పరిశీలించారు. ఎక్స్‌రే యంత్రంలో ఉన్న లోపాలను వారం రోజుల్లో పరిష్కరించాలని బయో మెడికల్ ఇంజినీర్ కృష్ణకాంత్‌కు సూచించారు. ప్రస్తుతం ఉన్న భవనంపైన నిర్మిస్తున్న మొదటి అంతస్తును మే 19 నాటికి పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణంలో ఎక్కడా నాణ్యత లోపించకూడదని చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో పిఒ మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, ఇతర వైద్య సిబ్బంది, ఎపిఎంఐడిసి డిఇ సిమ్మన్న, టెక్నికల్ అసిస్టెంట్ ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి -భామిని

మండలంలోని లివిరి, ఘనసర, భామిని సచివాలయాలను ఎంపిడిఒ జి.కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రికార్డుల, ఘనసర, భామిని సచివాలయంలో ఏర్పాటు ఆధార్ సెంటర్ సేవలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా పంచాయతీల్లో క్రాష్ ప్రోగ్రాం ద్వారా తాగునీటి ఎద్దడి సమస్యలు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచించారు. సమయ పాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

సిఎం మాటలు నమ్మే పరిస్థితి లేదు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

అబద్దాలను చెప్పి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాటలను నేడు ప్రజలు నమ్మే స్థితి లేదని పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. బుధవారం మండలంలోని రావికోన, బట్టివలసలో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా గ్రామంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. గిరిజనులకు సంబంధించిన పథకాలను ఎత్తివేయడంతోపాటు ట్రైకార్ ద్వారా ఒక్కపైసా కూడా రుణాలివ్వలేదని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు స్వంతానికి వాడుకుని గిరిజనులకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు జి.వెంకటనాయుడు, నాయకులు బోను చంద్రమౌళి, జి.రామ్మూర్తి, జాగాన రవికుమార్, బుడితి శ్రీరామ్, అమరాపు రామకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-బలిజిపేట

మాట్లాడుతున్న ఎంపిడిఒ భానుమూర్తి

ఉపాధి హామీ పనుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎంపిడిఒ ఎ.భానుమూర్తి హెచ్చరించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో క్షేత్రస్థాయి, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై వివిధ గ్రామాల నుంచి అనేక సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని చెప్పారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. పని ప్రాంతాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడంలో శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇసి శ్రీనివాసరావు, ఎపిఒ కేశవరావు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-వంగర

పది మందికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

మండలంలోని మద్దువలసలో వైసిపి టిడిపి వర్గీయుల మధ్య బుధవారం ఘర్షణ జరగడంతో పది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వంగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూరాడ గరికి నాయుడు, మన్నెన సన్యాసప్పుడు మధ్య ఓ స్థల వివాదంలో బుధవారం ఘర్షణ పడి సద్దుమణిగారు. మరలా కొద్దిసేపటి తర్వాత ఇరు వర్గాల మధ్య కొట్లాట జరగడంతో వైసిపికి చెందిన ముగ్గురుకు, టిడిపికి చెందిన ఏడుగురుకు గాయాలయ్యాయి. టిడిపికి చెందిన వారంతా రాజాంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా వైసిపికి చెందిన వారు రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. ఈ విషయం తెలుసుకున్న వంగర ఎస్ఐ బుడుమూరు లోకేశ్వర రావు క్షతగాత్రుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

గాయపడిన వైసిపి, టిడిపి కార్యకర్తలు

వైద్యసేవలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-సీతానగరం

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందజేస్తున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన ఉండాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి. జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని ఇప్పలవలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పలు అనారోగ్య సమస్యలతో అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి వైద్య సేవలను వివరించి అవగాహన కల్పించారు. కుటుంబ వైద్య సేవలు అందించే సిబ్బంది మొబైల్ నంబర్లు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల వద్ద

మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రదర్శించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.ఉషారాణి, సర్పంచ్ చింతల లక్ష్మణరావు, గుల్ల సంతోషికుమారి, శంకరరావు, సూపర్ వైజర్లు భవాని, జయగౌడ్, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు క్రాష్‌ప్రోగ్రాం

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

తాగునీటి ఎద్దడి నివారణకు మండలంలో క్రాష్‌ప్రోగ్రాం ఏర్పాటు చేసి తాగునీటి బోరుబావులకు మరమ్మతులు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భరత్‌చంద్ర తెలిపారు. మండలంలో 31 పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మండల పరిషత్ నుంచి కేటాయించిన నిధులతో మరమ్మతుల కోసం బోరుబావి పైపులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎంపిడిఒ ఎస్.రమేష్ క్రాష్‌ప్రోగ్రామ్‌ను పర్యవేక్షిస్తున్నారు.

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గుమ్మ లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బుధవారం గుమ్మలక్ష్మీపురం సంత దారిలో ఉన్న బాపూజీ విగ్రహం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని గ్రామ పంచాయతీ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాగునీటిని అధికారి మెడికల్ షాప్ యజమాని అనిల్ సరఫరా చేసేందుకు ముందుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో విఆర్ఒ బోడమ్మ, వైస్ సర్పంచ్ కిశోర్, మాజీ సర్పంచ్ ప్రేమానంద్, వైశ్య, వర్తక సంఘం సభ్యులు, దోస్త్ మేరా దోస్త్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఆస్పత్రుల్లో జరిగే ప్రమాదాలపై అగ్నిమాపక శాఖ బుధవారం ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఆస్పత్రులలో ప్రమా దాలను సమర్థవంతంగా ఎదుర్కోవడంపై అగ్ని మాపక అధికారి యు.సుధాకరరావు, సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. అగ్నిమాపక అధికారి సుధాకరరావు మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎప్పుడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే ఆ వార్డు లేదా ప్రదేశం నుండి మిగిలిన వార్డులకు మంటల వ్యాప్తి చెందకుండా విద్యుత్తు నిలుపుదల చేయాలని సూచించారు. ప్రమాదం జరిగిన వార్డులో ఉండే రోగులను మెట్లపైనుంచి సురక్షిత ప్రదేశానికి తరలించాలని, లిఫ్టును వినియోగించరాదని తెలిపారు. అగ్నిమాపక పరికరాలు ఉపయోగించడం వల్ల నష్టాన్ని తగ్గించి, ప్రమాదాన్ని నివారించవచ్చని చెప్పారు. ఇందుకు అవగాహన, అనుభవం కలిగిన సిబ్బంది అవసరమన్నారు. వేసవిలో ఎండ తీవ్రత, వాతావరణంలో మార్పుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.వాగ్దేవి పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నేరాలు ఘోరాలు

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవర చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బుధవారం 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామనిఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. అరకు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ఒక కారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఈ గంజాయి పట్టుబడిందన్నారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలను గురువారం వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

బాధితుడి చెంతకు ఐఫోన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం ఒడిశాకు చెందిన బాసదేవ్ కాంప్లెక్స్ లో ఐఫోన్ సెల్ ఫోన్ మర్చిపోయి బస్సు ఎక్కి వెళ్లిపోయారు, డ్యూటీలో ఉండే ఆర్టీసీ పోలీస్ కుర్చీలో ఉన్న ఫోన్ గమనించి ఎవరిదని విచారణ చేశారు. కొంత సమయం తర్వాత ఆ ఫోన్‌కు బాధితుడు ఫోన్ చేసి మరచిపోయానని తెలపడంతో ఆర్టీసీ కంట్రోల్ రామరాజు బాధితుడికి వివరాలన్నీ కనుక్కొని ట్రాఫిక్ కంట్రోలర్ ఆదినారాయణ, ఎస్‌టిఐ దుర్యోధన చేతుల మీదగా బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కంట్రోల్ రామరాజు ఆర్టీసీ పోలీస్ సత్యనారాయణ పాల్గొన్నారు.